

జలం..గరళం..

- కలుషితమవుతున్న నీరు - విజృంభిస్తున్న అతిసార

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

తాగేనీరు కలుషితం అవుతున్నాయి. తాగునీటి పథకాల వద్ద అధికారులు, సిబ్బంది సరైన పరిశుభ్రతా చర్యలు చేపట్టకపోవడంతో తాగు నీరు గరళంలా మారుతున్నాయి. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో అతిసార విజృంభిస్తోంది. గ్రామాలకు గ్రామాలే వాంతులు, విరేచనాల బారిన పడుతున్నారు..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 193 ఎస్ఎస్ ట్యాంకులు ఉన్నాయి. 32 సిపిడబ్ల్యూసి నీటి పథకాల ద్వారా ప్రజలకు నీటిని అందిస్తున్నారు. 4,261 చేతి పంపులు కూడా ఉన్నాయి. 796 పిడబ్ల్యూ పథకాల ద్వారా కూడా నీటిని అందిస్తున్నారు. నీటి పథకాల వద్ద సరైన పరిశుభ్రతా చర్యలు చేపట్టకపోవడంతో తాగేనీరు కలుషితం అవుతున్నాయి. కలుషిత నీటిని తాగడం వల్ల ప్రజలు వాంతులు, విరేచనాల బారిన పడుతున్నారు. గ్రామాల్లో అతిసార విజృంభిస్తోంది. జూపాడుబంగ్లా మండలంలోని చాబోలు గ్రామంలో గ్రామస్థులు మూడు రోజులుగా అతిసార బారినపడ్డారు. గ్రామంలో 100 కుటుంబాలు ఉన్నాయి. ఇప్పటి వరకూ 30 మంది వాంతులు, విరేచనాల బారినపడ్డారు. ఒకరు మత్యువాతపడ్డారు. మంచినీటి ట్యాంకులలో చెత్త చెదారముతో నిండి, పరిశుభ్రత లేకపోవడం, అలాగే మంచినీటి ట్యాంకులో పక్షులు మతి చెందడంతో నీరు కలుషితంగా మారి ఆ నీటితోనే అతిసారం సంభవించిందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అతిసారతో వ్యక్తి మతి చెందడంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి.



జూపాడుబంగ్లా మండలం చాబోలులో నీటి ట్యాంకులో పక్షి కళేబరం

పత్తికొండ మండలంలో అతిసార ప్రభలుతోంది. నాలుగు రోజులుగా పత్తికొండ పిహెచ్‌సి పరిధిలో 160 మంది అతిసార రోగులకు చికిత్స అందించారు. కలుషిత నీటితో రోగాల బారిన పడి ఇబ్బందులు తప్పడం లేదని రోగులు పేర్కొంటున్నారు. పత్తికొండ మండలం పత్తికొండ, హోసూరు చిన్నహుల్తి, పెద్దహుల్తి, మండగిరి, జూటూరు, దూదేకొండ, జయం తండా, చక్రాల పందికోన, కోతిరాళ్ల, కొత్తపల్లి గ్రామాలలో కలుషిత నీరు వల్ల వాంతులు విరోచనాలు జ్వరంతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలలో ప్రభుత్వ ఆసుపత్రులు లేక ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వాంతులు, విరోచనాలు, జ్వరం వచ్చిన రోగులకు సెలైన్ బాటిల్‌పెట్టి మాత్రలు ఇచ్చి ఇంటికి పంపిస్తున్నారు. తూతూ మంత్రంగా చికిత్స అందిస్తున్నారని రోగుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తికొండ మండలంలో 17 గ్రామాలలో చెత్తాచెదారం, డ్రెయినేజీలు నిండి అస్తవ్యస్తంగా మారింది. పారిశుధ్య పనులను చేపట్టడం లేదు. కుళాయిల్లో కలుషిత నీరు రావడం వల్ల రోగాల బారిన పడుతున్నారు.

మహానంది మండలం బసవాపురం గ్రామం పరిధిలో మంచినీటి ట్యాంకులు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. త్రాగునీటి ట్యాంకుల వద్ద ఫ్లోరింగ్ పాచి పట్టి, ట్యాంక్ చుట్టూ కూడా పాచితో నిండి ఉంది. ఆ గ్రామస్తులు త్రాగునీరు కావాలంటే ఈ నీటి ట్యాంకుల నుండి తీసుకొనవలసిన పరిస్థితి నెలకొంది. ట్యాంకుల పైన ఈ విధంగా అపరిశుభ్రంగా ఉంటే ట్యాంక్ లోపల నీరు ఎంత అపరిశుభ్రంగా వుంటుందో అని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ ట్యాంకుల ద్వారా వచ్చే నీటిని తాగి రోగాల బారిన పడుతున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లోనూ త్రాగునీటి ట్యాంకులు శుభ్రతకు నోచుకోకుండా అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి.



పత్తికొండ పిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న బాధితులు



మహానంది మండలం బసవాపురంలో అపరిశుభ్రంగా తాగునీటి ట్యాంకులు

కర్నూలు నగరంలోనూ కలుషిత నీరు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. నగరంలోని విష్ణుటౌన్ షిప్, మాసాని సోమప్ప కాలనీ, నాలుగో పట్టణ ప్రాంతాల్లో తాగునీటి కుళాయిల్లో ఒండ్రుతో కూడిన కలుషిత నీరు వస్తున్నాయి. తాగేనీరు కలుషితమైతే తాము అనారోగ్యాల బారిన పడతామని పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు కలుషిత నీటిని తాగలేక డబ్బులు వెచ్చించి మినరల్ వాటర్‌ను కొనుగోలు చేసి తాగుతున్నారు.

ప్రయివేటు ఆసుపత్రులకు రోగులు క్యూ..

వాంతులు విరోచనాల, జ్వరంతో రోగులు ప్రవేట్ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఆర్ఎంపి డాక్టర్లు తమకు నచ్చిన రీతిలో రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఆర్ఎంపి డాక్టర్లు, మెడికల్ స్టోర్ యాజమానులు రోగులను ఆసరా చేసుకొని మూడు పూలు ఆరుకాయలుగా దండుకుంటున్నారు.

తక్షణమే అధికారులు స్పందించాలి



కర్నూలు నగరంలో 20, 30 ఏళ్ల కిందట వేసిన పైప్‌లైన్‌లను మార్చలేదు. కొన్ని ప్రాంతాల్లో మురుగు నీరు కలుస్తున్నాయి. పెరిగిన జనాభాకు అనుగుణంగా తాగునీటి పైపుల నిర్వహణకు అనుభవం ఉన్న సిబ్బంది ఉండాల్సిన స్థాయిలో లేరు. సిబ్బందికి నీటి పైపులైన్‌లపై శిక్షణ ఇవ్వాలి. కర్నూలు నగరంలో రెండు నెలలుగా కలుషిత నీరు వస్తున్నాయి. ఏదైనా ఫిర్యాదు చేద్దామని వెళితే నీటి సరఫరా విభాగం అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందిచడం లేదు. తక్షణమే అధికారులు స్పందించాలి. కలుషిత నీరు రాకుండా చర్యలు చేపట్టాలి.

- ఇ.పుల్లారెడ్డి, పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

- మెరుగైన విద్యాబోధన అందించాలి
- ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు
- ప్రజాశక్తితో ఆర్ఐఒ గురువయ్య శెట్టి



ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ కళాశాలలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, లేకపోతే సంబంధిత కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని ఆర్ఐఓ ఎస్‌విఎస్ గురువయ్య శెట్టి పేర్కొన్నారు. ఇంటర్ విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుండే ప్రణాళికను రూపొందించుకున్నట్లు వెల్లడించారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు..

జిల్లాలో ఎన్ని జూనియర్ కళాశాలలు ఉన్నాయి?

ఆర్ఐఒ : జిల్లాలో మొత్తం 157 జూనియర్ కళాశాలలో ఉన్నాయి. ఇందులో 22 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 16 ఏపీ మోడల్ స్కూల్ కళాశాలలు, 4 ఎయిడెడ్ కళాశాలలు, రెండు ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు, 5 ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు ,82 ప్రైవేటు జూనియర్ కళాశాలలు, 25 కేజీబీవీ జూనియర్ కళాశాలలున్నాయి.

జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఆర్ఐఒ : ఇంటర్మీడియట్ విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించేందుకు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఉన్నతాధికారులు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన అకాడమిక్ క్యాలెండర్ దాదాపుగా 232 రోజుల పాటు నిర్వాహణకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం విద్యార్థులకు అన్ని కళాశాల యాజమాన్యాలు తరగతులను నిర్వహించాలి. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఉన్నతాధికారుల ఆదేశాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.

జిల్లాలో కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాలలు విచ్చలవిడిగా నిబంధనలు పాటించకుండా తరగతులు నిర్వహిస్తున్నాయి. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఆర్ఐఒ : జిల్లాలో ప్రవేటు కార్పొరేట్ జూనియర్ కళాశాల యాజమాన్యాలు ఎక్కడ కూడా అడ్మిషన్ల నిర్వహణలో ప్రచారం కల్పించరాదు. పెద్ద హోర్డింగ్‌లు కూడా ఏర్పాటు చేయరాదు. ఎక్కడైనా నిబంధనలను ఉల్లంఘిస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా కళాశాలలో ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలు ఉల్లంఘిస్తే అలాంటి వాటికి నోటీసులు ఇచ్చి విచారణ చేస్తాం. నిబంధనలు ఉల్లంగించినట్లు విచారణలో తేలితే కళాశాలను సీజ్ కూడా చేస్తాం.

గతంలో ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందక తీవ్ర అవస్థలు పడ్డారు? ఈ ఏడాది ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఆర్ఐఒ : ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలకు సంబంధించి గత ఏడాది ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. గతంలో టీటీడీ ఆధ్వర్యంలో పాఠ్యపుస్తకాలను ముద్రించి సరఫరా చేసే వారు. ఈ ఏడాది కూడా విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని నివేదిస్తాం.

ఇంటర్మీడియట్‌లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధనకు ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారు?

ఆర్ఐఒ : జిల్లా వృత్తి విద్యాధికారి సహకారంతో ఇంటర్మీడియట్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నాం. అందుకు అనుగుణంగా వారికి లక్ష్యాలను పెట్టి ఎప్పటికప్పుడు ప్రత్యేక తరగతులను కూడా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తాం.



స్విమ్మింగ్ విజేతలకు మెడల్స్ పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు ఒలంపిక్ డే సందర్భంగా సిమ్మింగ్ పోటీల్లో గెలుపొందిన ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. ఆదివారం ఫన్ అండ్ ఫుడ్ దగ్గర ఉన్న స్విమ్మింగ్ పూల్ వద్ద మెడల్స్ సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. ఇప్పుడున్న సమాజంలో ఒత్తిడీలకు గురి కాకుండా ఉండాలంటే స్విమ్మింగ్ చేయడం ఎంతో ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. ఇలాంటి పథకాలు ఎన్నో కర్నూలుకు తీసుకురావాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సిమ్మింగ్ కోచ్ నటరాజ్ రావు, కర్నూలు జిల్లా సిమ్మింగ్ ఆక్వాటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, కోశాధికారి పి.దస్తగిరి, సహాయ కార్యదర్శులు కె. రామకృష్ణ, శివరాజ్, అజ్రతయ్య, శివ, వెంకటేశ్వర్లు, మహేశ్వరరావు, ఈశ్వరయ్య, రాఘవేంద్ర, రఘు, నందు, వైకుంఠం, హరీష్ , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



స్విమ్మింగ్ విజేతలతో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, నిర్వహకులు

మున్సిపల్ కార్పొరేషన్ మీడియా కోఆర్డినేటర్‌గా నాయబ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి మీడియా, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నాయబ్ మహబూబ్ బాష నియమితులయ్యారు. ఈ మేరకు కమిషనర్ ఎ.భార్గవ్ తేజ ఉత్తర్వులు జారీ చేశారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని విషయాలను ఎప్పటికప్పుడు మీడియాకు చేరవేయడంతో పాటు నిత్యం సమాచారాన్ని అందించాలన్నారు. మేయర్ క్యాంపు కార్యాలయంలో పనిచేస్తున్న నాయబ్‌ను డిప్యూటేషన్‌పై నగర పాలక సంస్థ కార్యాలయానికి బదిలీ చేస్తూ, తక్షణమే రిపోర్ట్ చేయాలని కమిషనర్ ఆదేశించారు.





ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరం స్థానిక ఇందిరాగాంధీ నగర్‌లో ఆదివారం సుందరయ్య భవన్‌లో సుందరయ్య స్ఫూర్తిగా కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజా ఆరోగ్య వేదిక, జిబిఆర్ ఫౌండేషన్ సహకారంతో జరిగిన ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ నాగభూషణం, సంధ్య, పూజిత, తదితరులు సేవలు అందించారు. ఈ శిబిరంలో బిపి, షుగర్, పక్షవాతం, ఫిట్స్(మూర్చ) వ్యాధులకు వైద్య సేవలు అందించారు. కేవలం రూ.200 రెండు నెలలకు అవసరమైన మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం నాయకులు రామాంజనేయులు, జెవన్. శేషయ్య, బసయ్య, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు. మెడికల్ రేప్స్ యూనియన్ నాయకులు ప్రసాద్ శర్మ, వారి బృందం, వాలంటీర్లు హుసేనయ్య, యేసు, ఇబ్రహీం తదితరులు సేవలు అందజేశారు.

అత్యాచార నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

బాపట్ల జిల్లా, చీరాల మండలం, ఈపూరుపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో సీతారామ పేటకు చెందిన యువతిని అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని అఖిల భారత మహిళా సాంస్కృతిక సంఘం జిల్లా నాయకురాలు తేజోవతి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ ఘటనపై విచారణ చేపట్టి దుండగులను అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

పంచాయతీ సెక్రటరీలపై ,డాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ మండలంలోని గ్రామీణ ప్రాంతాలలో విధులు నిర్వహించే పంచాయతీ సెక్రెటరీలపై, ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఈశ్వర్‌రెడ్డి భవనంలో పత్రికా విలేకరుల సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి మాట్లాడుతూ పత్తికొండలో 100, వివిధ గ్రామాలలో60 మంది అతి సార రోగులు నమోదు కావడం అధికారులు నిర్లక్ష్యమే కారణమన్నారు. ఒహెచ్ఎస్ఆర్ ట్యాంకర్ల ద్వారా కొళాయిలకు కలుషిత నీరు రావడంతో వాంతులు, విరోచనాలు జ్వరంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి సరైన వైద్యం అందక నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. గ్రామాలలో డ్రెయినేజీల్లో చెత్తాచెదారం మురుగు నీరు నిలువ ఉండడంతో డెంగ్యూ, మలేరియా టైఫాయిడ్ సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమలు మందు స్ప్రే చేయడంలో అధికారులు పూర్తిగా విఫ్లవం చెందారని విమర్శించారు. పత్తికొండ పట్టణంలోని పలు వార్డులలో కుళాయిలు ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతున్నాయని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఒహెచ్ఎస్ఆర్ ట్యాంకులను శుభ్రం చేసి, నీరును సరఫరా చేయాలని డిమాండ్ చేశారు . ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులకు నామమాత్రపు చికిత్స అందించడం చాలా దుర్మార్గమన్నారు. రోగులను నిర్లక్ష్యం చేసిన డాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాసంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఆర్యవైశ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం

-రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్
-కర్నూలులో టిజి లక్ష్మీ వెంకటేష్ వాసవి వైశ్య హాస్టల్ ప్రారంభం
-రాజ్యసభ మాజీ సభ్యులు టిజి వెంకటేష్ హాజరు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఆర్యవైశ్యులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని నంద్యాల రోడ్డులో ఉన్న టిజి లక్ష్మీ వెంకటేష్ వాసవి ఆర్యవైశ్య హాస్టల్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. రాజ్యసభ మాజీ సభ్యులు టిజి వెంకటేష్ దంపతులు, ప్రముఖులు హాజరయ్యారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో టిజి భరత్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఆర్యవైశ్యులంటే రోశయ్య తర్వాత టిజి వెంకటేష్ గుర్తొస్తారని చెప్పారు. ఆర్యవైశ్యులకు మంచి చేసేందుకు తామెప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. విద్యాదానం ఎంతో గొప్పదన్నారు. ఆర్య వైశ్య హాస్టల్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తమ టిజివి సంస్థల తరుపున దశాబ్దాలుగా ప్రజలకు సేవ చేస్తూనే ఉన్నట్లు టిజి భరత్ తెలిపారు. తమ సేవలు ఎప్పటికీ కొనసాగుతూనే ఉంటాయన్నారు. అనంతరం మాజీ రాజ్యసభ సభ్యులు టిజి.వెంకటేష్ మాట్లాడుతూ తాను మొదటి నుండీ ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేసినట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో ఆర్యవైశ్యులను బానిసలుగా చూసేవారన్నారు. దివంగత నాయకుడు రోశయ్యతో కలిసి ఆర్యవైశ్యులు ఎన్నో సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. ఆర్యవైశ్యులను బానిసలుగా చూసే నాయకులకు గుణపాఠం చెబుతూ వైశ్యులకు తగిన గౌరవం కల్పించినట్లు గుర్తు చేశారు. చదువుకున్న వారికి ఉద్యోగాలు, చదువులేని వారికి ఉపాధి కల్పించి ఆదుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఆర్యవైశ్యుల ఆస్తులను పలువురు కాజేసేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. అలాంటి వారి నుండి ఆస్తులు రక్షించి ఆర్యవైశ్య కమ్యూనిటీ సొంతం చేసేందుకు కృషి చేస్తూనే ఉన్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, దేవకీవెంకటేశ్వర్లు, సిద్దా నాగేశ్వరరావు, పెనుగొండ సుబ్బరాయుడు, ఇల్లూరు లక్ష్మయ్య, టిజి.శివరాజు, అమరవాది లక్ష్మీనారాయణ, కోటా సత్యనారాయణ, రజిని, శబరి వరప్రసాద్, రాయపూడి గణేష్, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



హాస్టల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి టిజి.భరత్

ఆన్‌లైన్‌లో కనిపించని రైతుల భూములు

పట్టించుకోని రెవెన్యూ అధికారులు-ఆందోళన లో రైతులు

ప్రజాశక్తి-తుగ్గలి : తుగ్గలి, ఎర్రగుడి ,రాతన, ఎద్దులదొడ్డి రెవెన్యూ గ్రామాలలో కొంతమంది రైతులకు సంబంధించిన భూముల రికార్డులు ఆన్‌లైన్‌లో కనిపించకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. తుగ్గలి, ఎర్రగుడి ,రాతన, ఎద్దులదొడ్డి గ్రామాల్లో రెవెన్యూ అధికారులు రీ సర్వే చేశారు. రీ సర్వే చేసిన గ్రామాలలో కొన్ని భూములు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. ప్రస్తుతం రైతులు తమ పంట రుణాలను రెన్యువల్‌కు సంబంధిత వన్ బి, అడంగల్ ఆన్‌లైనలో తీసుకునేందుకు సచివాలయాలు, మీసేవ కేంద్రాలకు వెళ్లడంతో అక్కడ రైతుకు సంబంధించి అడంగల్ వన్ బి రాకపోవడంతో తీవ్ర ఆందోళన గురవుతున్నారు. ఈ విషయంపై రోజు తహాశీల్దార్ కార్యాలయం చుట్టూ రైతులు తిరగడంతోపాటు పలుసార్లు రైతులు, సిపిఎంతో కలిసి ఆందోళన చేసినా పట్టించుకోకపోవడంతో రైతులు బ్యాంకులలో రుణాలు రెన్యువల్ చేయించుకోలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నికలు ముగిసినా కొంతమంది రెవెన్యూ అధికారులు ఇంకా తహాశీల్దార్ కార్యాలయానికి రాకపోవడంతో రైతులు తమ అర్జీలను ఎవరికి ఇచ్చుకోవాలో తెలియక రోజు తహాశీల్దార్ ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రైతులకు సంబంధించిన వన్ బి, అడంగల్ రికార్డులను ఆన్‌లైన్‌లో వచ్చే విధంగా చూసి విధులకు డుమ్మా కొడుతున్న రెవెన్యూ అధికారులపై తగు చర్యలు తీసుకోవాలన్నారు.

సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

డి గౌస్ దేశాయి, సిపిఎం జిల్లా కార్యదర్శి

ప్రజాశక్తి-కర్నూల్ కార్పొరేషన్

కర్నూలు జిల్లా సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టి పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి కొత్త ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో సిపిఎం జిల్లాస్థాయి సమావేశాన్ని జిల్లా కమిటీ సభ్యులు ఎండి.ఆనంద్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి డి.గౌస్ దేశాయి మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరి మాటలు చెబుతూ పోవడం కాకుండా నూతన ప్రభుత్వమైనా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టు గురించి, విశాఖపట్నంను ఆర్థిక రాజధాని చేస్తామంటూ మాట్లాడడం మంచిదేనని అయితే విడిపోయిన కర్నూలు జిల్లా అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. 2019లో శంకుస్థాపన చేసిన గుండ్రేవుల, వేదవతి, ఆర్‌డిఎస్ కుడి కాలువల నిర్మాణం పట్ల చిత్తశుద్ధి లేని గత ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదన్నారు. పక్కనున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి ప్రత్యేక చొరవ తీసుకుని ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తి చేసి, కర్నూలు జిల్లా సాగు,తాగునీటి సమస్యను సంపూర్ణంగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఫార్మా, ఐటి ఇండస్ట్రియల్స్‌ను స్థాపించే అవకాశం ఉందన్నారు. బెంగుళూరు, హైదరాబాద్ రెండు రాష్ట్ర రాజధానుల మధ్య ఉన్న కర్నూలు నగరం పాలకులు ప్రత్యేక చొరవ చూపితే పరిశ్రమల కారిడార్‌గా మారే అవకాశం ఉందన్నారు. ఎన్నికల సమయం వచ్చేదాకా ఎదురు చూసి, ఎన్నికలకు పోయే ముందు హడావిడి చేయడం కాకుండా ప్రారంభంలోనే నిధులను కేటాయించి ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. పరిశ్రమలను కూడా ఏర్పాటు చేయాలన్నారు. కర్నూలు జిల్లా ప్రజానీకం పనులు చేయని వైసిపిని ఇంటికి సాగనంపి, టిడిపికి సంపూర్ణమైన మెజార్టీని ఇచ్చిందని, ఈ సదావకాశాన్ని ఉపయోగించుకొని జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యేలు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.రామాంజనేయులు, పిఎస్ రాధాకృష్ణ, కెవి.నారాయణ మాట్లాడారు. జిల్లా కమిటీ సభ్యులు ఎండి.అంజిబాబు, ఎన్.అలివేలు, అరుణమ్మ, టి.రాముడు, ఎం.రాజశేఖర్, సి.గురుశేఖర్, మోహన్, విజయ్, మధు, సీనియర్ నాయకులు ఇ.పుల్లారెడ్డి, కర్నూలు మండల కార్యదర్శి పిబి హుస్సేనయ్య, ఓర్వకల్ మండల కార్యదర్శి జి.నాగన్న, కర్నూలు, కల్లూరు, ఓర్వకల్లు, కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గౌస్‌దేశాయి, వేదికపై రాధాకృష్ణ, ఆనంద్‌బాబు



అమ్మ అంధుల పాఠశాలకు నిత్యావర సరుకులు అందిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

ఆత్మవిశ్వాసంతో అంధత్వాన్ని అధిగమించడం అభినందనీయం

సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

అంధత్వాన్ని శాపంగా భావించకుండా ఆత్మవిశ్వాసంతో అధిగమించడం అభినందనీయమని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూలు నగర సమీపంలోని పసుపల గ్రామం వద్ద ఉన్న అమ్మ అంధుల పాఠశాల విద్యార్థులకు ఒకనెల రోజులకు సరిపోయే విధంగా నిత్యావసర వస్తువులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకరశర్మ మాట్లాడుతూ అమ్మ అంధుల పాఠశాలలోని విద్యార్థులు చూపు లేకపోయినప్పటికీ తమ జ్ఞాననేత్రంతో ఈ ప్రపంచాన్ని చూడగలగడం అభినందనీయమని చెప్పారు. అమ్మ అంధుల పాఠశాల నిర్వాహకుడు సుధాకర్‌ను అభినందించారు. అంధత్వంతో బాధపడే వారికి అక్షర జ్ఞానాన్ని పెంపొందించేందుకు లూయిస్ బ్రెయిలీ రూపొందించిన ప్రత్యేక లిపి వారి జీవితాల్లో వెలుగులు నింపుతుందని చెప్పారు. మామూలు విద్యార్థులతో పోలిస్తే అంధత్వంతో బాధపడే విద్యార్థులకు ప్రత్యేక రక్షణ అవసరమని తెలిపారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ,ఎన్‌జిఒ సంఘాలు కృషి చేయాలని సూచించారు. మామూలు ఆశ్రమాలతో పోలిస్తే అంధుల కోసం ఆశ్రమం నిర్వహించడం కష్టకరమని, అనునిత్యం వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అంద విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించి ఏదైనా సమస్యలు వస్తే తన దృష్టికి తీసుకువస్తే అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానన్నారు. విద్యార్థులు పరీక్షలు రాయడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని నిర్వాహకుడు సుధాకర్ కోరిక మేరకు అందజేశానన్నారు. డాక్టర్ శంకర్ శర్మ నిర్వహకుడు సుధాకర్ సన్మానించారు.

జిఒ నెం.117ను రద్దు చేయాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగానికి గొడ్డలిపెట్టుగా మారిన జిఒ నెం.117ను రద్దు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టియు) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యద ర్శులు, ఎస్.గోకారి, టికె.జనార్ధన్, రాష్ట్ర పూర్వపు ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సలాం ఖాన్ ఎస్‌టియు భవనంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోకేశ్ యువగళం పాద యాత్రలో ఇచ్చిన హామీని నెర వేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా అడు గులు వేయాలన్నారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయడం ద్వారా విద్యార్థుల సంఖ్యను పెంచవచ్చని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు సమాంతరంగా తెలుగు, ఉర్దూ, కన్నడ మాధ్యమాలను కొనసాగించా లన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సహధ్యక్షులు సి.నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నాగరాజు , రాష్ట్ర కార్యదర్శి బి.నాగ రాజు, ఆర్థిక కమిటీ సభ్యులు బి.సుంకన్న ,ఆర్థిక కార్యదర్శి రామ్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఎస్ ట్యాంక్ పటిష్టం చేయిస్తాం

- టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు భూపాల్ చౌదరి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణ ప్రజల దాహార్తి తీర్చే బసాపురం సమ్మర్ స్టోరేజ్ వాటర్ ట్యాంక్ పటిష్టతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని టిడిపి కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు భూపాల్ చౌదరి తెలిపారు. ఆదివారం బసాపురం సమ్మర్ స్టోరేజ్ వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ దుస్థితికి పాలకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. రూ.కోటి 80 లక్షలకు మరమ్మతు పనులు చేయించినా పూర్తిస్థాయిలో పనులు జరగక అసంపూర్తితో మిగిలిందన్నారు. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ట్యాంకును పూర్తిస్థాయిలో పటిష్టపరిచేందుకు కావలసిన నిధుల మంజూరుకు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి మీనాక్షి నాయుడు కృషి చేస్తారన్నారు. త్వరలోనే మున్సిపల్ అధికారులతో సంప్రదించి వారి నివేదికను సీఎం చంద్రబాబుకు అందజేసి సమస్య పరిష్కారానికి చొరవ చూపుతారన్నారు. పైప్ లీకేజీ కారణంగా పట్టణంలో చాలా చోట్ల సక్రమంగా నీరు సరఫరా కాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పైపులైను మార్పు వంటి కార్యక్రమాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి తాము



ఎస్ఎస్ ట్యాంకును పరిశీలించిన భూపాల్ చౌదరి

అందుబాటులో ఉంటామన్నారు. కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ కార్యదర్శి బుద్ధారెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి, మాజీ కౌన్సిలర్, తిమ్మప్ప, మాజీ ఎల్ఎల్సీ డిస్ట్రిబ్యూట్ కమిటీ చైర్మన్ బసాపురం రామస్వామి, ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జయరాం ఉన్నారు.

చెట్టు కింద చదువులు

- ఉపాధ్యాయులు ఫుల్....తరగతి గదులు నిల్....
- వేధిస్తున్న తరగతి గదుల కొరత

ప్రజాశక్తి-ఆదోని రూరల్

ఆహ్లాదకర వాతావరణంలో చదవాల్సిన విద్యార్థులు అవస్థల మధ్య పాఠాలు నేర్చుకుంటున్నారు. తరగతి గదులు కొరతతో చెట్ల కిందే చదువులు సాగిస్తున్నారు. మండలం పరిధిలో సంతేకూడ్లురు గ్రామ జడ్పీ హైస్కూల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అవస్థలు గత ప్రభుత్వం నాడు-నేడు పనులు పూర్తి చేసి మౌలిక సదుపాయాలు కల్పించింది. అందులో భాగంగా మరుగుదొడ్ల, నీటి పైప్‌లైన్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఫర్నిచర్, గ్రీన్‌చాక్ బోర్డు, కిచెన్‌షెడ్డు, ఇంగ్లీష్ ల్యాబ్ తదితర పనులు చేపట్టారు. అయితే అదనపు తరగతుల జోలికి పోకపోవడంతో తరగతి గదుల కొరత వేధిస్తోంది. ప్రధాన సమస్య అయిన తరగతి గదుల నిర్మాణాన్ని పట్టించుకునే నాథుడే లేడు. తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు దాగి ఉంటుంది. ఉత్తమ పౌరులు తయారయ్యేది తరగతి గది నుంచే..అలాంటి తరగతి గదులతోపాటు విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ 540 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఒక ప్రధానోపాధ్యాయురాలుతో పాటు, 16 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. 540 మంది పైగా ఉన్నా విద్యార్థులు 5 గదులు మాత్రమే ఉన్నాయి. మిగతా తరగతి గదులు అంత బయటనే చెప్పాల్సిన పరిస్థితి ఉందని ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా.. మారుమూల



బేస్మెంటు లెవల్‌లో ఆగిన అదనపు గదుల నిర్మాణం



చెట్టు కింద పాఠాలు చెప్పుతున్నా ఉపాధ్యాయుడు

గ్రామాల్లోని పాఠశాలలను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో విద్యార్థులను ఆరు బయట చెట్ల కింద కూర్చొబెట్టి ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. పాఠశాల పక్కనే రోడ్డు ఉండడంతో ఆరుబయట చదివే విద్యార్థులకు వాహనాల శబ్దాలు ఇబ్బందికరంగా మారాయి. ఒకవేళ వర్షం కురిస్తే ఉన్న ఒకే గదిలో అందరినీ కూర్చోబెడుతున్నారు. 2014 టిడిపి హయంలో నాలుగు అదనపు గదులు నిర్మించాలని ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వంలో బేస్మెంట్ వర్క్ చేసి పనులు వదిలిపెట్టేశారు. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో అదనపు గదులు నిర్మాణాలు పూర్తి చేయాలని అలాగే పాఠశాల చుట్టూ కాంపౌండ్ వాల్ కూడా నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు. తరగతి గదులు సరిగా లేకపోవడంతో ఈ పాఠశాలకు వచ్చేందుకు విద్యార్థులు జంకుతున్నారని, దీంతో పేద పిల్లలు చదువుకు దూరమయ్యే అవకాశం ఉన్నదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి పాఠశాలకు తరగతి గదులు నిర్మించాలని కోరుతున్నారు.

సోమన్నకు 'తెలుగు బంధువు' బిరుదు ప్రదానం

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు రూరల్

పెద్దకడబూరు మండల పరిధిలోని కంబదహాళ్ ప్రాథమికోన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త, బాలబంధు గద్వాల సోమన్నను ప్రతిష్టాత్మక "తెలుగు బంధువు" బిరుదు వరించింది. బాలసాహిత్యవేత్త సోమన్న విశేష తెలుగు సాహితీ కృషికి గాను, అనతి కాలంలో 52 పుస్తకాలు రాసి ముద్రించినందుకుగాను తెలుగు కవితా వైభవం (తెలుగు అభివృద్ధి సమితి), తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో' 'తెలుగు కవితా వైభవం-దశాబ్ది ఉత్సవాలు" సందర్భంగా అధ్యక్షులు మేక రవీంద్ర వారిచే, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ చేతుల మీద ఈ అవార్డు రవీంద్ర భారతిలో అందుకున్నారు. అనంతరం కవి గద్వాల సోమన్నను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా డాక్టర్ టి.గౌరి శంకర్, గౌరవ అతిథిగా డాక్టర్ నాళేశ్వరం శంకరం, డాక్టర్ దాసోజు పద్మావతి, విశ్రాంత రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సి.పి.రెడ్డి, ఘంటారావం గంటా మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. "తెలుగు బంధువు" అవార్డు గ్రహీత సోమన్నను తోటి ఉపాధ్యాయులు, గ్రామస్థులు, శ్రేయోభిలాషులు, విద్యార్థులు అభినందించారు.

సోమన్నకు 'తెలుగు బంధువు' బిరుదు ప్రదానం పట్ల పలురు హర్షం

పెద్దకడబూరు: పెద్దకడుబూరు మండలం కంబదహాళ్ ప్రాథమికోన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త , బాలబంధు గద్వాల సోమన్నను ప్రతిష్టాత్మక "తెలుగు బంధువు" బిరుదు వరించింది. బాలసాహిత్యవేత్త సోమన్నను వారి విశేష తెలుగు




భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బిరుదు అందుకుంటున్న సోమన్న

సాహితీ కషిగాను, అనతి కాలంలో 52 పుస్తకాలు రాసి ముద్రించినందుకు తెలుగు కవితా వైభవం (తెలుగు అభివృద్ధి సమితి) , తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'తెలుగు కవితా వైభవం-దశాబ్ది ఉత్సవాలు' సందర్భంగా అధ్యక్షులు మేక రవీంద్ర,హైదరాబాద్ వారిచే పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ చేతుల మీదుగా ఈ అవార్డు రవీంద్ర భారతిలో ఆదివారం అందుకున్నారు. సోమన్నను తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు, శ్రేయోభిలాషులు, విద్యార్థులు అభినందించారు.

మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు పట్టణంలోని 32వ వార్డు రాఘవేంద్ర నగర్, సంజీవ్ నగర్‌లో మంచినీటి సమస్య తో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, మంచి నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సిపిఎం నాయకులు పి.గోవిందు, బి.రాముడు, ఎం.అబ్దుల్లా, రమేష్, తిమ్మప్ప డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం రాఘవేంద్ర నగర్‌లో మహిళలతో పెద్ద ఎత్తున సమావేశం నిర్వహించారు. గోవిందు మాట్లాడుతూ ఎమ్మిగనూరు మున్సిపాలిటీ గ్రేడ్ వన్ మున్సిపాలిటీగా పేరు ఉందని, ప్రజలకు కనీసం తాగడానికి నీళ్లు ఇవ్వలేకపోవడం శోచనీయమని విమర్శించారు. గత ప్రభుత్వం ఐదేళ్ల నుండి రాఘవేంద్ర నగర్ ప్రజలు తాగునీటి సమస్యను స్థానిక మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకొని వచ్చారని, అయినా ఆ ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని అన్నారు. ప్రజలు కేవలం తాగడానికి నీళ్లు అడిగినా ఇవ్వకపోవటం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మిగనూరు పట్టణ ప్రజలు నీటి పన్ను సంవత్సరానికి సుమారు రూ.మూడు కోట్ల చెల్లిస్తున్నారన్నారు. నీటి పన్నే కాకుండా గత ప్రభుత్వం చెత్త పన్నుతో సహా పన్నులు వసూలు చేసిందని అన్నారు. గతంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి రాఘవేంద్ర నగర్‌కు పైప్ లైన్ టెండర్ పూర్తి



మాట్లాడుతున్న సిపిఎం నాయకుడు గోవిందు

అయిందని వెంటనే పైపులను వేస్తామని హామీ ఇచ్చారని, ఇంత వరకు పైప్ లైన్ వేయడం గానీ తాగునీటి సమస్యను గానీ పరిష్కరించకపోవడం ప్రజలపైన వారికున్న ప్రేమ ఏ పాటిదో అర్థమవుతుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి రాఘవేంద్ర నగర్‌లో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య వెంటనే పరిష్కారం కానిపక్షంలో ఆ కాలనీ ప్రజలతో ఖాళీ బిందెలతో నిరసన చేపడుతామని మున్సిపల్ అధికారులను హెచ్చరించారు.

సురక్షితమైన వైద్యం ఆయుర్వేదం, యూనాని

ప్రజాశక్తి - ఆదోని

ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్‌లేని వైద్యం ఆయుర్వేదం, యూనాని వైద్యాన్ని ప్రజలు అలవాటు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని ఆయుష్ శాఖ ప్రముఖ వైద్యాధికారి డాక్టర్ ఎండి అతావుర్ రెహమాన్ సూచించారు. ఆదివారం ఆదోనిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పూర్వకాలం నుండి ఆయుర్వేదం అందుబాటులో ఉందన్నారు. మందులు వాడిన వారు ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ కాకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. వెంటనే ఉపశమనం కలగాలని రోగులు అల్లోపతి మందులకు అలవాటు పడ్డారన్నారు. ఈ మందులు అధికంగా వాడడం వల్ల కిడ్నీ, గుండె, లివర్ వంటి అవయవాలకు సైడ్ ఎఫెక్ట్ వచ్చే అవకాశం ఉండవచ్చు అన్నారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు వాడే అల్లోపతి మందులతో పాటు ఆయుర్వేదిక్, యునాని మందులు వాడడం వల్ల సైడ్ ఎఫెక్ట్ రాకుండా కొంతవరకు నివారణ చేయవచ్చని వివరించారు. ప్రస్తుతము ఆయుర్వేదిక్ యునాని వైద్యాన్ని సద్వినియోగం చేసుకోకపోవడం వల్ల రానున్న కాలంలో మరుగుపడే అవకాశం లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోనే ఆయుష్ విభాగంలో తమ ఆసుపత్రి పని చేస్తుందన్నారు. స్కిన్, గర్భ సంబంధమైన, కిడ్నీ తదితర వ్యాధులకు తమ ఆసుపత్రిలో చికిత్స లభిస్తుందన్నారు. యూనాని మందులు నవాబుల కాలం నాటివని శాస్త్రీయంగా ఆధారం ఉందన్నారు. తమ ఆసుపత్రిలో 10 పడకలు రోగుల కోసం ఏర్పాటు సదుపాయము అందుబాటులో ఉందన్నారు. ప్రస్తుతం మందుల కొరత ఉన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తెలియజేశామన్నారు. ఆయుష్ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న కాంపౌండర్ 2, ఎంఎన్ఓ 3, ఎఫ్ఎన్ఓ 3, స్టాఫ్ నర్స్ 2, ఏఎన్ఎం 1, అటెండర్ 2,



డాక్టర్ ఎండి అతావుర్ రెహమాన్

వాచ్‌మ్యాన్ 1 పోస్టుల వివరాలను ప్రభుత్వం దృష్టికి తెలియజేశామన్నారు. త్వరలో భర్తీ చేస్తారన్నారు. ఆయుష్ విభాగం మళ్లీ పూర్వ వైభగంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు.

అందరికీ అందని కరువు పరిహారం

ప్రజాశక్తి - హోళగుంద

గత సంవత్సరం వర్షాలు కురువక పంటలన్నీ ఎండిపోయి పెట్టిన పెట్టుబడి సైతం చేతికి రాలేదు. పొలాలలో విత్తన పత్తి, పొద్దుతిరుగుడు, వేరుశనగ ,కొర్రలు, జొన్నలు తదితర పంటలు దెబ్బతిన్నాయి. ఎంత నష్టం జరిగిందని గుర్తించి వ్యవసాయ అధికారుల ద్వారా సర్వే చేయించి పూర్తి సమగ్ర నివేదిక ఆధారంగా కరువు పరిహారం అందించాలని నిర్ణయించారు. రైతు శ్రేయస్సు ప్రభుత్వ ధ్యేయమని గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వాలు అన్నదాతలకు కొండంత నష్టం జరిగితే గోరంత పరిహారం అందించడంలో పక్షపాతం చూపించాయి. కొంతమంది రైతులకు కరువు పరిహారం అందితే మరి కొంతమంది రైతులకు కరువు పరిహారం అందక దిగులు చెందుతున్నారు. పరిహారం కొందరికి అందితే మరికొందరికి అందకపోవడం బాధాకరమని మండిపడుతున్నారు. 50 ఎకరాలు ఉన్న రైతుకు సైతం ఐదు ఎకరాల లోపే పరిహారం అందిస్తామని, గత ప్రభుత్వం నిబంధనలు పెట్టడం వల్ల పెద్ద రైతులకు రూ.34 వేల లోపల పరిహారం అందితే చిన్న, సన్నకారు రైతులకు రూ.10,000 నుండి రూ.20 వేలు వరకే అందించడం అన్యాయమని రైతుల పేర్కొంటున్నారు. లక్షల్లో నష్టం జరిగితే కంటి తుడుపు చర్యగా ఇంత తక్కువ ఇన్పుట్ సబ్సిడీ అందించడం ఎంతవరకు న్యాయమని అన్నదాతలు వాపోతున్నారు. మండలంలో 8657.38 హెక్టర్లలో వివిధ పంటలకు నష్టం జరిగినట్లు గుర్తించారు. 8819 మంది రైతులు ఉన్నట్లు రూ 14 కోట్ల 67 లక్షల 8 వేల ఎనిమిది వందల ఐదు మంజూరైనట్లు రికార్డులు ఆధారంగా తెలుస్తుంది. కరువు కారణంగా నష్టపోయిన అన్నదాతలు అందరికీ కరువు పరిహారం అందకపోవడం వల్ల ప్రభుత్వం మారింది. ఇంకా మిగిలిన వారికి అందవలసిన కరువు పరిహారం అందుతుందా లేదా అని అన్నదాతల అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



కొన్ని తప్పుల వల్ల కొందరికి అందలేదు

- ఎఒ ఆనంద్ లోక్‌దాల్

కొంతమంది రైతుల ఖాతా నంబర్లు తప్పుగా నమోదు కావడం, ఆధార్ అనుసంధానం కాక పోవడం, బ్యాంకుల కోడ్‌లు ఇలా కొన్ని తప్పుల వల్ల ఇన్పుట్ సబ్సిడీ 1429 మంది రైతులకు అందలేదు. ఇన్పుట్ సబ్సిడీ అందని రైతుల నుండి వివరాలు తెచ్చుకొని సరి చేసిన నివేదిక ఉన్నత అధికారులకు పంపాం. త్వరలో వారికి కూడా ఇన్పుట్ సబ్సిడీ వారి ఖాతాకు జమ అవుతుంది.



- స్వర్ణ పల్లకిలో రాఘవేంద్రుని ఊరేగింపు

రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల సందడి

- స్వర్ణ పల్లకిలో ఊరేగింపు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశంలో ఉన్న వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చిన అనంతరం బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ శ్రీ మఠం ప్రాకారంలో పల్లకోత్సవం నిర్వహించారు.

లోకేష్‌ను కలిసిన జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షులు

ప్రజాశక్తి - చిప్పగిరి

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌ను తన చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఆదివారం జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షులు మేకల రవియాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఇంటర్మీడియట్ చదువుతున్న పేద విద్యార్థులకు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు పుస్తకాల, నోటు బుక్స్ సైతం ఉచితంగా పంపిణీకి చర్యలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. పశ్చిమ ప్రాంతంలో వెనుకబడిన ఆలూరు నియోజకవర్గంలో చాలా సమస్యలు ప్రజలకు వెంటాడుతున్నాయని, ఈ సమస్యలను పరిష్కరించేలా మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.



మంత్రిలోకేష్‌కు మేకల రవియాదవ్

మృతుని కుటుంబానికి అండగా ఉంటాం

- టిడిపి నాయకులు ఎన్ రఘునాథ్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం : మృతుడు వడ్డే తిమ్మప్ప కుటుంబానికి టిడిపి, రాఘవేంద్ర రెడ్డి కుటుంబం అండగా ఉంటామని టిడిపి ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి సోదరులు మాధవరం మాజీ సర్పంచ్ ఎన్ రఘునాథ్ రెడ్డి హామీ ఇచ్చారు. వడ్డే తిమ్మప్ప గత కొంతకాలంగా అనారోగ్యం బాధపడుతూ ఆదివారం తెల్లవారుజామున చనిపోయారు. విషయం తెలుసుకున్న రఘునాథ్ రెడ్డి మృతుడికి నివాళులు అర్పించి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. టిడిపి ఎప్పుడు ఉంటుందని ధైర్యం చెప్పి భరోసా ఇచ్చారు.

కోడ్‌కు విరుద్ధంగా ఆపరేటర్ పోస్టుల భర్తీ

- నకిలీ సర్టిఫికెట్‌లతో చలామణి

ప్రజాశక్తి - ఆలూరు

ప్రభుత్వ నిబంధనలు ప్రకారం కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాలు చేపట్టాలంటే ముందస్తుగా నోటిఫికేషన్ విడుదల చేసి రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించి ఉద్యోగ నియామకాలు భర్తీ చేయాలి. అందుకు విరుద్ధంగా విద్యుత్ శాఖలో రాజకీయ నాయకులకు తలొగ్గి నిరుద్యోగుల నుండి లక్షల రూపాయలు దండుకొని అధికారులు, గుత్తేదారులు కలిసి ఇష్టారాజ్యంగా పోస్టులు నియామకాలు జరిపినట్లు తెలిసింది. నోటిఫికేషన్ ఇవ్వకుండా కోడ్ ఉల్లంఘిస్తూ, ఆపరేటర్ల నకిలీ సర్టిఫికెట్లతో నియమించినట్లు తెలిసింది. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఎన్నికల కమిషన్ మార్చి 16 నుండి జూన్ 4 వరకు కోడ్ అమలోకి తెచ్చింది. కోడ్ అమలులో ఉన్నా కర్నూలు జిల్లా ఆలూరు సబ్ డివిజన్ పరిధిలో ఉన్న కోగిలతోట గ్రామంలో నూతనంగా నిర్మించిన 33/11కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌లోని నాలుగు ఆపరేటర్ పోస్టులను మార్చి 23 తరువాత భర్తీ చేసినట్లు సమాచారం. మార్చి 21న ప్రజాశక్తిలో "నోటిఫికేషన్ ఇవ్వకుండానే నియామకాలు" అనేశీర్షిక ప్రచురణ కంటే ముందు మార్చి 19న ప్రజాశక్తి ఆలూరు విద్యుత్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్ర ప్రసాద్‌ను వివరణ కోరగా కోగిలతోట సబ్ స్టేషన్‌లో ఆపరేటర్ పోస్టులకు ఇంత వరకు ఎటువంటి నోటిఫికేషన్ వదలలేదని, సెలక్షన్ కమిటీలో ఎస్ఇ, ఇఇ ఉంటారని ఔట్ సోర్సింగ్ ఏజెన్సీకి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి నియమించినవారిని విధుల్లోకి తీసుకుంటామని తెలిపారు. నోటిఫికేషన్ ఇవ్వకుండా, ఇసి ఆదేశాలను ధిక్కరిస్తూ విద్యుత్ శాఖ అధికారులు, గుత్తేదారులు కుమ్మక్కై, ఆపరేటర్ పోస్టులను లక్షల రూపాయలు దండుకుని సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయకుండా నియామకాలు జరిపినట్లు నిరుద్యోగులు పేర్కొంటున్నారు.

సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

- పి.హనుమంతు, సిపిఎం జిల్లా నాయకులు



ఎన్నికల కమిషన్ ఆదేశాలను ధిక్కరించి, ఎటువంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా గుట్టు చప్పుడు కాకుండా విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్ పోస్టులను భర్తీ చేశారు. అధికారులు, గుత్తేదారు, నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారి సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుని నియామకాలను రద్దు చేయాలి.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

- ముఖ్యమంత్రికి రాఘవేంద్ర రెడ్డి విజ్ఞప్తి

ప్రజాశక్తి - మంత్రాలయం

నియోజక వర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి నియోజకవర్గ ఇంచార్జీ ఎన్ రాఘవేంద్ర రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం అమరావతిలో చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి తన ఓటమికి గల కారణాలను వివరించినట్లు ఫోన్ ద్వారా తెలిపారు. నియోజకవర్గంలో వలసల నివారణకు, తాగు, సాగు నీటి సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరామని, స్పందించిన సిఎం సంబంధించిన మంత్రులను ఆదేశించగా వారిని కూడా కలిశామని చెప్పారు. అందులో భాగంగా టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్‌ను కలిసినట్టు చెప్పారు. టిడిపి ప్రభుత్వంతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత రెడ్డి తదితరులు ఉన్నారు.



ముఖ్యమంత్రితో రాఘవేంద్ర రెడ్డి , తదితరులు

రైతులు సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవాలి

- సొసైటీ ఇంచార్జీ సిఇఒ నరసింహులు

ప్రజాశక్తి - ఆస్పరి

సొసైటి కార్యాలయంలో సభ్యత్వం ఉన్న రైతులు తమ సభ్యత్వాలను రెన్యువల్ చేసుకోవాలని ఆస్పరి సొసైటి ఇంచార్జి సీఈవో నరసింహులు రైతులకు సూచించారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సొసైటీలో రుణం పొందిన ప్రతి ఒక్క రైతు సభ్యత్వాని రెన్యువల్ చేసుకోవాలని కోరారు.

సభ్యత్వం యధావిధిగా కొనసాగాలంటే రైతులు పొలం పాసు బుక్కు, సహకార సంఘం పాసు బుక్కు, ఆధార్ కార్డు, పాన్ కార్డు జిరాక్సులు, రెండు పాస్ ఫోటోలు సహకార సిబ్బందికి ఇవ్వాలని తెలిపారు. రెన్యువల్ చేయని రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టే సబ్సిడీలకు అర్హులు కాదని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వరంగల్‌లో ఆత్మగౌరవ కవాత్‌ను విజయవంతం చేయండి

అభివాదం చేసిన నాయకులు

ప్రజాశక్తి-ఆదోని

వరంగల్‌లో జూలై7న జరిగే మాదిగల ఆత్మగౌరవ కవాత్‌ను విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ ఎంఎస్‌సి జిల్లా నాయకులు బండారి హనుమంతు మాదిగ, బండారు గిడ్డయ్య మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం ఆదోనిలోని 8, 9 వార్డుల ఇన్‌ఛార్జీలు కాంతరాజ్, దత్తు ఆధ్వర్యంలో శ్రీరామ్ నగర్ నూతన వార్డు కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా టి.నరసింహులు, ఉపాధ్యక్షులు బండారి దినేష్, ప్రధాన కార్యదర్శి కె. తాయన్న, కార్యదర్శి బండారి మారన్న, సహాయ కార్యదర్శి సుబ్బులు, కార్యవర్గ సభ్యులు బి.ఈశ్వర్ తోపాటు 12 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ టౌన్ కన్వీనర్ వన్నెల మణికంఠ మాదిగ, నీలకంఠ, ఎం.ప్రదీప్, జిఎస్ ఈరన్న పాల్గొన్నారు.



రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆదోని

గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందిన సంఘటన ఆదోని ఆర్ఎస్ ఇస్వీ మధ్యలో చోటు చేసుకుంది. ఆదివారం రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపిన వివరాల మేరకు రైల్వే ట్రాక్ కిమీ 498/23 లైన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకొని తీవ్ర రక్తగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9849157634 నంబరుకు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు.